# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 08-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ధైర్యం, శౌర్యం, త్యాగాలతో ఆరు దశాబ్దాలుగా బీఎస్ఎఫ్ దేశ సరిహద్దు భద్రతను కాపాడుతోందని హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- ❖ భారతదేశ ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలకు పశ్చిమాసియా అత్యంత కీలకమైనదని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు.
- ❖ భగవద్గీత యావత్ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తోందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ పేర్కొన్నారు.
- ❖ ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జనవరి 13 నుండి ఫిబ్రవరి 26 వరకూ జరగనున్న మహా కుంబమేలాకు కేంద్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లను చేస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ధైర్యం, శౌర్యం, త్యాగాలతో ఆరు దశాబ్దాలుగా సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) దేశ సరిహద్దు భద్రతను పటిష్టం చేసేందుకు కృషి చేస్తోందని హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఈరోజు జోధ్‌పూర్‌లో జరిగిన సరిహద్దు భద్రతా దళం 60వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... 1965 నుంచి తూర్పు, పశ్చిమ సరిహద్దులను భద్రంగా రక్షించేందుకు BSF అద్భుతంగా పని చేస్తోందన్నారు. బీఎస్ఎఫ్ లేకుండా దేశంలో పెరుగుతున్న భద్రతా అవసరాలను తీర్చడం అసాధ్యమని, అందుకే 25 బెటాలియన్లతో ప్రారంభమైన బీఎస్ఎఫ్ నిరంతరం విస్తరిస్తోందని తెలిపారు. దేశ సరిహద్దు భద్రతా విధానంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని పేర్కొంటూ ....

(వాయిస్ 44 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీలో జరిగిన అష్టలక్ష్మి మహోత్సవం ఈశాన్య రాష్ట్రాల శక్తివంతమైన వస్త్ర రంగాన్ని, పర్యాటక అవకాశాలను, సాంప్రదాయ హస్తకళా నైపుణ్యాన్ని ప్రదర్శించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. మెరుగైన

అనుసంధానం, డిజిటల్ సేవల వినియోగం, మౌలిక సదుపాయాల కల్పనలో పెట్టుబడుల ద్వారా ఈశాన్య భారతదేశం అద్భుతమైన వృద్ధిని సాధిస్తోందని వివరిస్తూ.. ఒక వార్తాపత్రికకు కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా రాసిన కథనాన్ని ఈరోజు నరేంద్ర మోడీ ఆయన సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భగవద్గీత యావత్ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తోందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ గీతా మహోత్సవం సందర్భంగా హర్యానా లోని ఈ రోజు కురుక్షేత్రలో గీతాజ్ఞాన సంస్థానం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. భగవద్గీత సారాంశాన్ని, సానుకూల ఆలోచనలను సామరస్య సందేశాన్ని అర్థం చేసుకోవాలని ఆయన కోరారు. సామాజిక క్రమశిక్షణ, శాంతి, అభివృద్ధి, సోదరభావం, పురోగతి, ఆనందానికి భగవద్గీత సూత్రాలు చాలా అవసరమని జగదీప్ ధన్‌ఖర్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు రాజస్థాన్, హర్యానాలో పర్యటించనున్నారు. రాజస్థాన్ లో పర్యటన సందర్భంగా జైపూర్ ఎగ్జిబిషన్ అండ్ కన్వెన్షన్ సెంటర్‌లో రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ సమ్మిట్ - 2024ను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం పానిపట్‌లో ప్రధానమంత్రి బీమా సఖీ యోజనను ప్రారంభిస్తారు. మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణులైన 18 నుండి 70 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలకు సాధికారత కల్పించేందుకు ఈ పథకం రూపొందించబడింది. అదే విదంగా హర్యానాలోని కర్నాల్‌లోని మహారాణా ప్రతాప్ హార్టికల్చరల్ ఉధ్యానవన విశ్వవిద్యాలయం ప్రధాన ప్రాంగణానికి కూడా నరేంద్రమోదీ శంకుస్థాపన చేయనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలకు పశ్చిమాసియా అత్యంత కీలకమైనదని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్. ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. దోహాలో ఈ రోజు జరిగిన మనమా డైలాగ్‌లో పశ్చిమాసియా కోసం భారతదేశం సమగ్ర వ్యూహాన్ని నివేదించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... గల్ఫ్ కో-ఆపరేషన్ కౌన్సిల్, ఇరాన్, ఇరాక్‌లతో భారతదేశం 17 వేల నుండి 18 వేల కోట్ల డాలర్ల వార్షిక వాణిజ్యాన్ని నిర్వహిస్తున్నదని, మధ్యధరా దేశాలతో వాణిజ్యం 8 వేల నుండి 9 వేల కోట్ల డాలర్లుగా ఉందని వెల్లడించారు. గల్ఫ్ ప్రాంతంలో కోటి మంది భారతీయులు, మధ్యధరా దేశాలలో 5 లక్షల మంది ప్రవాస భారతీయులతో భారతదేశం, పశ్చిమాసియా మధ్య ఒక ముఖ్యమైన వారధి ఏర్పడిందని జై శంకర్ పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ రోజు నుంచి మూడు రోజుల పాటు రష్యాలో పర్యటిస్తున్నారు. రేపు ఆయన భారత నౌకాదళంలోకి ఐఎన్‌ఎస్ తుషీల్ అనే స్టెల్త్ యుద్ధనౌకను ప్రవేశపెట్టే కార్యక్రమాన్ని వీక్షించనున్నారు. రష్యాలోని కలినిన్‌గ్రాడ్ నగరంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. ప్రపంచంలోని అత్యంత ఆధునిక ఫ్రిగేట్ తరగతి యుద్ధనౌకల్లో ఇదొకటి, హిందు మహాసముద్ర ప్రాంతంలో భారత నౌకాదళ పోరాట సామర్థ్యాన్ని ఇది మరింత మెరుగుపరుస్తుందన్నారు. ఈ పర్యటనలో రష్యా రక్షణ మంత్రి ఆండ్రే బెలోవ్‌సోవ్‌తో రాజ్‌నాథ్ సింగ్ చర్చలు జరపనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జనవరి 13 నుండి ఫిబ్రవరి 26 వరకూ జరగనున్న మహా కుంబమేలాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లను చేస్తోంది. అందులో భాగంగా ఈశాన్య రైల్వే వారణాసి డివిజన్ పరిధిలోని ఝుసీ రైల్వే స్టేషన్ ను రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ఈరోజు పరిశీలించారు. ఆయనతో పాటు ఈశాన్య రైల్వే వారణాసి డివిజన్ జనరల్ మేనేజర్ సౌమ్య మాథుర్, రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్ స్టేషన్ లో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. విండో ట్రైయిలింగ్ రైలు ద్వారా భారతీయ రైల్వే మహా కుంబమేలాకు చేపడుతున్న ఏర్పాట్లను అశ్విని వైష్ణవ్ సమీక్షించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ....

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

నాలుగు పవిత్ర ధామ్‌ల శీతాకాలపు నివాస క్షేత్రాలను సందర్శించే అవకాశాన్ని భక్తులకు అందించే శీతాకాల ఛార్‌ధామ్ యాత్ర ఈరోజు ఉత్తరాఖండ్‌లో ప్రారంభమైంది. శీతాకాలంలో కేదార్‌నాథ్ విగ్రహం ఉండే ఓంకారేశ్వర్ ఆలయంలో ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఈ యాత్రను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... శీతాకాల ఛార్ధామ్ యాత్ర చేపట్టే యాత్రికులకు సౌకర్యాలు పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. భక్తులకు సుసంపన్నమైన అనుభూతిని అందించడానికి ప్రభుత్వం అవసరమైన ప్రతి ప్రయత్నం చేస్తుందన్నారు. యాత్ర కోసం సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రణాళికలు మరింత సమర్దవంతంగా అమలు చేసేందుకు రాబోయే రోజుల్లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నామని ఆయన తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లే భక్తుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే.. తాజాగా జనవరి మాసంలో ప్రత్యేకంగా 34 ప్రత్యేక రైళ్లను పడపనుంది. హైదరాబాద్ - కొట్టాయం; కొట్టాయం - సికింద్రాబాద్, మౌలాలి - కొట్టాయం, కాచిగూడ - కొట్టాయం, మౌలాలి - కొల్లం మధ్య జనవరి 3 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఈ ప్రత్యేక రైళ్లు నడవనున్నాయని రైల్వే శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా అడిలైడ్ టెస్ట్‌లో ఆతిధ్య జట్టు ఆస్ట్రేలియా పది వికెట్ల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. దీంతో 5 మ్యాచ్ టెస్ట్ సిరీస్ 1-1తో సమమయ్యింది. ఇక మూడో టెస్ట్ డిసెంబర్ 14 నుంచి బ్రిస్బేన్ వేదికగా జరగనుంది. మరోవైపు దుబాయ్ వేదికగా జరిగిన అండర్యా19 ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్‌పై బంగ్లాదేశ్ జట్టు విజయం సాధించి మరోసారి టైటిల్ విజేతగా నిలిచింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపురలలో ఈరోజు అర్ధరాత్రి, రేపు తెల్లవారు జామున దట్టమైన పొగమంచు వాతావరణం నెలకొనే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =